# సరదా కథలు

## పెళ్ళికి మరో కవాళ్ళెళ్ళు

చౌలా హడావుడిగా, గొడగొడవగా, ఒక కోణం నుంచి ఎంతో గాభరాగా మరోకోణం నుంచి కాస్త సరదాగా ఉంది సికిందరాబాద్ రైల్వేస్టేషన్— భారత రాజకీయాల్లాగ!

ఓ జంట మాత్రం ఎవర్నీ పట్టించుకోకుండా తెగ బాధపడిపోతోంది. అంత హడావుడిలోను ప్రతి ఒక్కరూ ఆ జంటవైపే చూసి ముసిముసిగా నవ్వుకుంటూ నిష్క్రమిస్తున్నారు.

ఆ జంటలోని వ్యక్తుల పేర్లు యధాప్రకారం రాధా, మోహన్.

"వెళ్ళగానే ఉత్తరం రాస్తావు కదూ రాధా!"

"అలా ఎలా అడుగుతున్నావు మోహన్!? ఉత్తరం రాయకుండా ఉండగలనా? అయినా తప్పంతా నీదే... చక్కగా ఇప్పుడు నాతో వచ్చి మా అమ్మనాన్నలతో మాట్లాడి ముహూర్తం పెట్టించేసుకోవచ్చు కదా... అనవసరంగా ఆఫీసు, సెలవు అంటూ డిలే చేస్తున్నావు... ఆడ పిల్లని... నా బాధ ఎలా చెప్పుకోగలను!"

"అ... నీకేం చక్కగా తప్పంతా నాదే అన్నట్టు నా మీద తోసేసి మాట్లాడుతున్నావు. నీకు తెలుసుకదా... మరో నెల దాకా సెలవు నాకు దొరకదని... అయినా పరీక్షలైపోగానే ఇంటికి పారిపోవాలా...?"

"ఇది మరీ బావుంది. ఇప్పటికే పట్నంలో ఉంచి చదివిస్తున్నందుకు మా వూళ్ళోనూ, బంధువుల్లోను తెగ బుగ్గలు నొక్కుకుంటున్నారు. పరీక్షలవగానే ఇంటికి వెళ్ళకపోతే ఇహ మా కుటుంబాన్ని ఆ ఊళ్ళో సుఖంగా బ్రతకనియ్యరు..."

"మరి పునర్దర్శనం?"


"అది నీ చేతుల్లోనే ఉంది..." వచ్చే నెల సెలవు పెట్టుకొని వచ్చి మా వాళ్ళతో మాట్లాడి ముహూర్తాలు పెట్టిస్తావు కదూ?"

"భలేదానివి రాధా! ఇప్పుడు నేను నిన్ను అనాలి... అలా ఎలా అడుగుతున్నావు... అని. అలా చెయ్యకుండా ఉండగలనా... నీకు తెలీదూ... మన పెళ్ళి సాధ్యమైనంత త్వరగా జరగాలని నేనెంత తహతహలాడిపోతున్నానో?"

పిస్లలిచ్చి అయిదు నిముషాలైనా పట్టించుకోని జంట ఒక్కసారిగా ఈ లోకంలోకి వచ్చిపడింది... రైలు కుదుపుతో...

ఇద్దరూ చేతులూపుకున్నారు. రైలు వేగాన్నందుకుంది.

ఇదంతా మూడురోజుల క్రితం కథ.




ఇప్పుడు మోహన్ కుతకుతలాడిపోతున్నాడు కోపంతో, ఇక లాభం లేదని కాగితం కలం తీసుకొని రాయడం మొదలుపెట్టాడు.

"డియర్ రాధ!"

ఛీ! నిన్ను డియర్ అని సంబోధించటం నాదే బుద్ధి తక్కువ. రాపింది మనసులోనైనా, కాగితం మీదనైనా కొట్టేసే మనస్తత్వం నీది కాని నాది కాదు కనుక ఆ సంబోధనని అలాగే ఉంచుతున్నాను.

మొదట నిన్ను తిట్టేముందు జరిగిందేమిటో చెప్తున్నాను. నీకు సెండాఫ్ ఇచ్చి రూమ్‌కి వెళ్ళే సరికి మా నాన్న, అమ్మ ఉన్నారు. ఓ పల్లెటూళ్ళో పెళ్ళి చూపులు ఏర్పాటుచేశారు. నాకు సెలవు దొరకదన్నాను తప్పించుకునే ఉద్దేశంతో.

అయినా మా నాన్న ఘటికుడు. "అందుకే ఆదివారం పెళ్ళిచూపులు ఏర్పాటుచేశాను. శనివారం మధ్యాహ్నం ఆఫీసు అయిపోయాక కారులో ఆ ఊరువెళ్తాం. ఆదివారం ఉదయం పెళ్ళి చూపులు అయిపోయాక రాత్రిలోగా నిన్ను ఆదే కారులో సికింద్రాబాద్ చేరుస్తాను కారు కూడా పెళ్ళివారే ఇచ్చారు" అని లాక్కెళ్ళిపోయాడు.

త్రోవలో 'నేనో అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయినే పెళ్ళిచేసుకుంటాను' అన్నాను.

"అయితే ఈ పెళ్ళిచూపులు మాత్రం కానిచ్చెయ్. నచ్చలేదని చెప్పెయ్. ఆ తర్వాత నువ్వు ప్రేమించిన అమ్మాయి సంగతి చూద్దాం. లేకపోతే ఇక్కడ నా మాట పోతుంది" అన్నాడు నాన్న.

నాక్కూడ నాన్న చెప్పింది సబబే అనిపించింది.

అందుకే ఆ పల్లెటూరు వచ్చాను. తీరా పెళ్ళికూతురుగా కూర్చున్నది నువ్వు.

షాకయిపోయాను. నీ గురించి నేనింత ఆలోచించి మా అమ్మానాన్నలను కూడా ఒప్పిస్తే నువ్వు ఆల్రెడీ పెళ్ళిచూపులకి రెడీ అయిపోయావా...? పెళ్ళిచూపులకి నేనే వస్తానన్న విషయం నీకు తెలీదని నాకు తెలుసు.

అంటే ఆ వచ్చింది నేను కాకపోతే, ఇంకెవరైనా అయితే, వాళ్ళకి నువ్వు నచ్చేస్తే ఏం చెప్పి ఉండే దానివి?

ఇక్కడే... ఇక్కడే... నాకు నీ మానసిక శీలం మీద నమ్మకం పోయింది. అంచేత ఇప్పుడు నేను నిన్ను నా మనిషిగా ట్రీట్ చెయ్యలేను. నీతో పెళ్ళికి ఒప్పుకోలేను. నన్ను మర్చిపో. నేన్నిన్ను మర్చిపోడానికి ట్రై చేస్తాను.

గుడ్ బై...

ఇట్లు మోహన్.

అని రాసేసి పై నుంచి కింద వరకూ మరోసారి

చదువుకుని తృప్తిగా తలాడించి కవరు పోస్ట్‌లో పడేసి వచ్చి సీట్లో కూచున్నడతను.

అప్పటికే ఓ కవరు అతని టేబుల్ మీద ఉంది. 'పోస్ట్ ఆయ్యే సాబ్' అన్నాడు ప్యూను. సరేనని తలూపుతూ కవరు చింపాడు.

''మోహన్ బాబూ!

సంబోధన కొత్తగా ఉందా... సినిమాల్లో మోహన్ బాబు విలన్‌గా వచ్చి హీరోగా సెటిలయితే నువ్వు నా జీవితంలోకి హీరోగా వచ్చి విలన్‌గా ఎస్టాబ్లిష్ అయ్యావు. అందుకే ఆ సంబోధన.

నాతో ఊరొచ్చి మా అమ్మానాన్నలని ఒప్పించడానికి లేని సెలవు ఇంకో అమ్మాయిని పెళ్ళిచూపులు చూడానికి వచ్చిందా... అక్కడ పెళ్ళిచూపుల్లో కూచున్నది నేనే అవడం నా అదృష్టం... నీ దురదృష్టం.''

నువ్వు దానికి ఏవేవో కథలు చెప్పొచ్చు. గాని నా వైపు నుంచి జరిగింది విను.

నేనింటికి వెళ్ళగానే మా బాబాయ్ గారింట్లో ఆదే... వేరే... పల్లెటూళ్ళో... పెళ్ళిచూపులు ఏర్పాటుచేశారు. నీకు తెలుసుగా మా ఇంట్లో మా నాన్న చెప్పిందే వేదం. ఎదురు చెప్పే దమ్ములు ఎవ్వరికీ లేవు.

మా అమ్మతో మన సంగతి చెప్పి ఏడ్చాను. ''ఈ తంతు ఎలాగోలాగ గట్టెక్కించు. ఆ కుర్రాడికి నువ్వు నచ్చాలిగా. నచ్చకపోతే మరీ మంచిది. ఒకవేళ నచ్చి, వ్యవహారం పెళ్ళిదాకా వెళ్తే ఈ లోగా నువ్వు ప్రేమించిన మోహన్‌కి నువ్వు ఉత్తరం రాయి పెళ్ళికి మరో మూణ్ణెల్లు దాకా ముహూర్తాలు లేవు. మనకి కొంత టైముంది. ఈ లోగా నువ్వు ప్రేమించిన మోహన్ రాదలిస్తే నాన్నతో నేను చెప్తాను. ఏం చెయ్యడానికీ మనకి చాలా టైముందికదా... ప్రస్తుతానికి మాత్రం పరువు కాపాడు'' అంది అమ్మ.

ఆడదాన్ని... పైగా పల్లెటూళ్లో తల్లిదండ్రుల చాటున పరువుగా పెరుగుతున్నదాన్ని. ధైర్యం చెయ్యలేనన్నసంగతి నీకు తెలుసు. పెళ్ళి లోగా నువ్వు వచ్చి నన్ను కాపాడకపోతావా అని నిన్నే తల్చుకుంటూ నీమీద కొండంత ఆశతో తలవంచి పెళ్ళిచూపులకి కూచుని తలెత్తితే నువ్వు!

నిజం చెప్పు... ఏ ఆడదానికైనా ఇది షాక్ అవుతుందా అవదా?

నన్ను ప్రేమించి అన్ని కబుర్లు చెప్పి హాపీగా పెళ్ళిచూపులకి తయారయ్యావే అక్కడ కూచున్నది నేనుకాకపోతే ఏం చేసేవాడివి? ఒప్పుకుని నా బ్రతుకు బండలు పాలు చేద్దామనా నీ ఉద్దేశం... లేక కాదని ఇంకో అమ్మాయిని నిరాశ పరచాలనా? ఏం అనుకుని తయారయ్యావు పెళ్ళిచూపులకి? ఇక్కడే... ఇక్కడే... నాకు నీ మానసిక శీలం మీద నమ్మకం పోయింది.

అంచేత... సెలవ్... రాధ!

అని ఉందా ఉత్తరంలో!


# చిత్రభూమి

సంచలనాత్మక సినిమా వారపత్రిక



మీ అభిమాన నటుడు సుమన్

మీ ప్రశ్నలకు మీ అభిమాన సినిమా వారపత్రిక చిత్రభూమిలో సమాధానాలిస్తున్నారు

మీ ప్రశ్నలను ''సుమన్ సమాధానాలు, కేరాఫ్ చిత్రభూమి, 5–8–55/ఏ, నాంపల్లి స్టేషన్ రోడ్, హైదరాబాద్: 500 001''కి పంపండి.


## సుదేశ బేరీ సిగ్గు



మషాల్ ఫేమ్ మిస్టర్ సుదేశ బేరీకి ఇపుడిపుడే సినిమాల్లో చాన్స్‌లు దొరుకుతున్నాయి. కాని అతను రొమాంటిక్ సీన్స్‌లో నటించడానికి సిగ్గు పడుతున్నాడట. కారణం ఏమిటని అడిగితే—

''స్టేజీపై ఏక్టింగ్ వేసేటప్పుడు హీరోయిన్లతో దూరంగా వుండి నటించే అలవాటు వుంది నాకు. అందుకే ఇపుడు కాస్త సిగ్గుగా అనిపిస్తుంది. రాను రాను అలవాటు అవుతుంది'' అంటు సిగ్గు పడుతూ వెళ్ళాడట.